




# వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక

PUBLISHED: RANGAREDDY | సంపుటి: 10 | సంచిక: 20 | ఆదివారం, 01 ఫిబ్రవరి, 2026 | ఎడిటర్ : బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు: 5 | వెల: 3/-




# నా గౌరవానికి భంగం

**నోటీసులు గోడకు అంటించడం సరైన పద్ధతి కాదు**

**14,21 రాజ్యాంగ అధికరణలకు విరుద్ధం**

**నా నివాసం ఎర్రవల్లి, రూల్స్ ప్రకారం విచారణ అక్కడే జరగాలి**

**అయినా నందినగర్‌లోనే అందుబాటులో ఉంటా: పోలీసులకు మాజీ సిఎం కెసిఆర్ లేఖ**

**హైదరాబాద్ బ్యూరో :** ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలంటూ జూబ్లీ హిల్స్ ఏసీపీ జారీ చేసిన నోటీసులపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారు.. సుదీర్ఘంగా రాసిన ఆరు పేజీల లేఖలో ఆయన పోలీసుల వైఖరిని ఎండగట్టారు. ముఖ్యంగా జూబ్లీ హిల్స్‌లోని తన నంది నగర్ నివాసం గోడపై నోటీసును అతికించడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక మాజీ ముఖ్యమంత్రి పట్ల ఇటువంటి చర్యలు రాజ్యాంగ విరుద్ధమని, తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అసలు జూబ్లీహిల్స్ ఏసీపీకి తనపై ఇలాంటి నోటీసులు జారీ చేసే అధికార పరిధి లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. తనకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదన్నారు. ఈనోటీసు ద్వారా తన గౌరవానికి భంగం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో కుటుంబ సభ్యులెవరూ లేని సమయం టలో వచ్చి... గోడలకు నోటీసులు అంటించడం సరైన పద్ధతి కాదని హితవుపలికారు. చట్టంలోని నిబంధనలను ఉటంకిస్తూ కేసీఆర్ పోలీసుల తీరులోని లోపాలను వివరించారు. సీఆర్పీసీ సెక్షన్ 160 ప్రకారం, 65 ఏళ్లు పైబడిన వ్యక్తులను విచారించాల్సి వస్తే, అది వారి నివాసం వద్దే జరగాలని పార్లమెంట్ చట్టం చెబుతోందని ఆయన గుర్తు చేశారు. తన ప్రస్తుత నివాసం ఎర్రవల్లి గ్రామమని, నిబంధనల ప్రకారం అక్కడే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పోలీసుల తీరుపై ఎన్ని అసహనాలు ఉన్నప్పటికీ, ప్రతిపక్ష నేతగా దర్యాప్తునకు తన వంతు సహకారం అందిస్తానని కేసీఆర్ ప్రకటించారు. నేడు మధ్యాహ్నం 3 గంటలకు తాను విచారణకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అయితే పోలీసులు అడిగినట్లు కాకుండా, తన నంది నగర్ నివాసంలోనే విచారణ జరపవచ్చని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో తనకు పంపే ఏవైనా నోటీసులు లేదా సమాచారం ఉంటే వాటిని తన ఎర్రవల్లి నివాసానికే పంపాలని పోలీసులకు సూచించారు. కాగా గతంలో హరీష్ రావు నోటీసుల విషయంలో పాటించిన పద్ధతులను, తన విషయం లో పోలీసులు పాటిస్తున్న వైఖరిని పోల్చి చూపిస్తూ.. పోలీస్ శాఖ 'డబుల్ స్టాండర్డ్స్' పాటిస్తోందని విమర్శించారు. ఎన్నికల అఫిడవిట్‌లో ఉన్న చిరునామాకు, ప్రస్తుతం తాను నివసిస్తున్న చోటికి మధ్య వ్యత్యాసాన్ని గమనించకుండా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు.

**సుప్రీం తీర్పు ప్రస్తావన**

ఈ లేఖలో కేసీఆర్ సుప్రీంకోర్టు తీర్పులను కూడా ప్రముఖంగా ప్రస్తావించారు. 'సతేందర్ కుమార్ అంతిల్ వర్సెస్ సీబీఐ' కేసు తీర్పు ప్రకారం, వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల్లో నోటీసులు పంపడం చట్టబద్ధం కాదని ఆయన వెల్లడించారు. పోలీసులు కావాలనే చట్టాలను ఉల్లంఘిస్తున్నారని, వారి చర్యలు ఆర్టికల్ 14 , 21లకు విరుద్ధంగా ఉన్నాయని ఆరోపించారు. ఒకవేళ పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని ఆయన హెచ్చరించారు. అక్రమ పద్ధతిలో ఇచ్చిన ఈ నోటీసులను తాను విస్మరించవచ్చని, అయినప్పటికీ బాధ్యతాయుతమైన పౌరుడిగా తాను విచారణకు సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు.



## ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర పవార్

**ప్రమాణ స్వీకారం చేసిన అజిత్ పవార్ భార్య**

ఎన్సీపీ దివంగత నాయికుడు అజిత పవార భార్య, సునేత్ర పవార్ జనవరి 31వ తేదీన ముంబైలోని లోక్‌భవన్‌లో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారంతో ఆమె రాష్ట్రంలో తొలి ఉపముఖ్యమంత్రి అయ్యారు. సునేత్ర పవార్ ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో అజిత్ దాదా అమర్ రహే అంటూ ఎన్సీపీ నాయకులు నినాదాలు చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి సిఎం దేవేంద్ర ఫడ్నవిస్, ఉపముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే, గవర్నర్

మిగతా 2లో

## నిర్మల ఎవరికి ఏమిస్తారు?

**ద్రవ్యోల్బణం తగ్గినా తగ్గని ధరలు**

**కుటుంబ ఆదాయాన్ని మించిన నిత్యావసరాల ఖర్చు**




**జనవరి 31 :** ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా కేంద్ర బడ్జెట్ 2026-27 ఆర్థిక లెక్కలకు అతీతమైన అంచనాల భారంతో రానుంది. ఎంత మేరకు ప్రజల కోరికలు తీరనున్నాయి అనే విషయం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం బడ్జెట్ పత్రాన్ని పార్లమెంటుకు సమర్పించినప్పుడే వెల్లడవుతుంది. సుమారు 6.8 నుంచి 7 శాతం మధ్య వృద్ధిని నమోదు చేస్తున్న ప్రధానమైన, వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ చాటుకుంటోంది. అయినప్పటికీ, ఈ స్థూలం చిత్రానికి కింద చాపకింద నీరులా కనిపించని అసమతుల వాస్తవికత దాగి ఉంది. కుంచించుకుపోయిన గృహ బడ్జెట్లు, అలసిపోయిన మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులు, ఆచితూచి అడుగులు వేస్తున్న ప్రైవేట్ పెట్టుబడులు, పెరుగుతున్న ప్రపంచ వాణిజ్య అనిశ్చితి వంటివన్నీ కూడా అంతర్లీనంగా ప్రవహిస్తున్నాయి. పతాక శీర్షికన బడ్జెట్‌ను ప్రకటించడంతో సరిపోదు. ఇది ఆర్థిక లోతుకు, విధాన విశ్వసనీయతకు ఒక పరీక్ష.

**సాధారణ పౌరుడు, జీవన వ్యయ సంక్షోభం**

సాధారణ పౌరుడికి ఆర్థిక విజయానికి కొలమానం జీడీపీ చార్టులు కాదు, నిత్యావసర వస్తువులు అందుబాటు ధరల్లో ఉండటమే. ద్రవ్యోల్బణం దాదాపు 5శాతానికి పరిమితమైనప్పటికీ, ఆహార ధరలు అస్థిరంగా ఉన్నాయి. ముఖ్యంగా, పప్పు దినుసులు, ధాన్యాలు, వంట నూనెల ధరలు తగ్గాయన్న భావన ప్రజలకు రావడం లేదు. గత ఐదేళ్లుగా విద్య, ఆరోగ్య సంరక్షణ, రవాణాపై వ్యయం పెరుగుతున్న కుటుంబ ఆదాయాన్ని మించి ఉంటున్నాయి. సబ్సిడీతో కూడిన ఆహారం నుంచి ఉపాధి మద్దతు వరకు ఉన్న సంక్షేమ పథకాలు, ఇప్పుడు లక్షలాది మందికి వినియోగానికి ఆధారంగా నిలుస్తున్నాయి. దీనిని ఏమాత్రం తగ్గించినా పిరమిడ్ దిగువన ఉన్న డిమాండ్ బలహీనపడే ప్రమాదం ఉంది. ఇది మొత్తం ఆర్థిక కార్యకలాపాలలో గణనీయమైన వాటాను కొనసాగిస్తున్నందున చాలా కీలకమైంది.

మిగతా 2లో

## పాలస్తీనాకు మద్దతు కొనసాగిస్తాం

**అరబ్ విదేశాంగ మంత్రుల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన**



**జనవరి 31 :** గాజా శాంతి ప్రణాళికతో సహా కొనసాగుతున్న శాంతి యత్నాలను స్వాగతిస్తూనే, పాలస్తీనా ప్రజలకు భారతదేశ నిరంతర మద్దతును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జనవరి 31, 2026న అరబ్ విదేశాంగ మంత్రులతో జరిగిన సమావేశంలో పునరుద్ఘాటించారని ప్రధానమంత్రి కార్యాలయం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రకటన పాలస్తీనా సమస్యపై భారతదేశ దీర్ఘకాలిక వైఖరిని పునరుద్ఘాటించడంతో పాటు, ప్రాంతీయ శాంతి, సుస్థిరతల పట్ల తన నిబద్ధతను నొక్కి చెప్పింది. ఈ సంభాషణ భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సంయుక్తంగా నిర్వహించిన రెండవ భారత్- అరబ్ విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా జరిగింది. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ప్రాంతీయ సవాళ్ల నేపథ్యంలో అరబ్ దేశాలతో భారత్ సంబంధాలను బలోపేతం

మిగతా 2లో



## వనంలోకి అమ్మలు

**అశేష భక్తజనం మధ్య అమ్మవార్ల వన ప్రవేశం**

**సమ్మక్క,సారలమ్మలను దర్శించుకున్న 2 లక్షల మంది భక్తులు**

**వుదయం, మేడారం :** తెలంగాణ కుంభమేళా మేడారం జాతర ముగిసింది. గత నెల 21న సాయంత్రం గిరిజన పూజారుల ప్రత్యేక పూజలతో సారలమ్మ రాకతో ప్రధాన జాతర మొదలైంది. గత నెల 28న మహాజాతర ప్రారంభమై.. శనివారం రాత్రి ముగిసింది. గత నెల 28న సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజులు గద్దెలపైకి రాగా, 29న రాత్రి సమ్మక్క తల్లి గద్దెపై ప్రతిష్ఠితమయ్యారు. 30న రోజంతా నలుగురు దేవతలు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ అమ్మవార్లతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజు వనాన్ని వీడి గద్దెలకు చేరారు. జాతర చివరి అంకంలో భాగంగా శనివారం రాత్రి అమ్మవార్లు వనప్రవేశం చేశారు. దీంతో నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సమాప్తమైంది. గద్దెల వద్ద నుంచి డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వనంలోకి తరలివెళ్లారు. అశేష భక్తజనం ఆ ఘట్టాన్ని తిలకించి పులకించిపోయారు. సమ్మక్క, సారలమ్మ నినాదాలతో అరణ్యం దద్దరిల్లింది. కాగా ఈ ఏడాది మేడారం జాతరకు సుమారు రెండు కోట్ల మంది భక్తులు హాజరై వనదేవతలను దర్శించుకున్నారు. తల్లులు గద్దెపైకి చేరడంతో ఎక్కువ మంది భక్తులు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం జాతర ముగిసినప్పటికీ భక్తులు తిరుగువారం వరకు మొక్కులు చెల్లించుకుంటారు. చివరి రోజైన శనివారం పలువురు రాజకీయ ప్రముఖులు వనదేవతలను దర్శించుకున్నారు. వనప్రవేశం పూర్తయినా భక్తుల రద్దీ కొనసాగుతుంది. నేడు రాత్రివరకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారు. మరోవైపు 4వేలమంది పారిశుధ్య సిబ్బంది విధుల్లో ఉన్నారు. మేడారం జాతర విజయవంతం కావడానికి సహకరించిన భక్తులు, అధికారులు, సిబ్బంది, మీడియాకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. జాతర విజయవంతం అవడంపై గవర్నర్, సీఎం సంతోషం వ్యక్తం చేశారని వెల్లడించారు.

## దివ్యాంగుల అండ

**కేరళ లో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్ బ్యూరో :** దివ్యాంగుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. కేరళకు చెందిన దివ్యాంగ్ చైల్డ్ వుమెన్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన సభ్యులతో ఆయన శనివారం ప్రజాభవన్ లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ దివ్యాంగులు కూడా సమాజంలో భాగమేనని వారి అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. వైకల్యం దురదృష్టకరమే అయినా.. వారిని సమాజంలో అందరితో సమానంగా అభివృద్ధి చేసేందుకు అందరూ కలిసి పనిచేయాలన్నారు. కేరళలో కూడా వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న భట్టి... ఆ ప్రభుత్వంలో అన్నివర్గాలతో సమానంగా దివ్యాంగులకు అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

## మున్సిపోల్స్ సెమీ ఫైనల్స్

- ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఖమ్మం, మహబూబాబాద్, జనగాం జిల్లాల్లో ప్రచారం



**మహబూబాబాద్, పాలేరు :** ఈ నెల 11న రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు రెండున్నరేళ్ల తమ కాంగ్రెస్ పాలనకు రెఫరెండం అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఈ ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం సెమీ ఫైనల్స్‌గా భావిస్తోందని చెప్పారు. పుర ఎన్నికల్లో తమకు సరైన పోటీయే లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తో కలిసి పోటీ చేసిన ఇతర పార్టీల పొత్తులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. కలిసి వచ్చే పార్టీలతో ముందుకు వెళ్తామన్నారు. కలిసి వచ్చే పార్టీలకు కాంగ్రెస్ తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయన్నారు. గొంతెమ్మ కోరికలు కోరకుండా కలిసి వచ్చే ప్రతి రాజకీయపార్టీని కాంగ్రెస్ గతంలో మాదిరిగా కలుపుకుని పోతుందన్నారు. శనివారం పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం , మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, వర్ధన్నపేట జనగాం మున్సిపాలిటీల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఆనాటి పాలకులు తమ అకౌంట్లు నింపుకోవాలని చూశారే తప్ప,

మిగతా 2లో

## తెలంగాణ రైజింగ్‌కు బ్రాండ్ అంబాసిడర్లు కండి



- హార్వర్డ్ వర్సిటీ పూర్వ, ప్రస్తుత విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- తెలంగాణ ప్రగతికి నైపుణ్యాన్ని శక్తి, సామర్థ్యాలను వినియోగించడానికి సిద్ధంగా ఉన్నాం : హార్వర్డ్ స్టూడెంట్స్
- పర్యటన చివరి రోజున వివిధ ప్రతినిధి బృందాలతో సిఎం భేటీ
- లీడర్ షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ తరగతులకు హాజరైన రేవంత్

**హైదరాబాద్ బ్యూరో :** దేశభవిష్యత్తుకు తెలంగాణ రాష్ట్రం ప్రధానంగా హైదరాబాద్ నగరంఆదర్శంగా నిలుస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. భారతదేశంతో అనుసంధానం పెంచుకొని పని చేయాలని అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ, ప్రస్తుత విద్యార్థినీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. తమ ప్రతి భ, నైపుణ్యం, సంకల్పంతో తెలంగాణ రైజింగ్ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాని సూచించారు. సీఎం పిలుపుపై సానుకూలంగా స్పందించిన విద్యార్థులు తెలంగాణ అభివృద్ధి పథంలో తమ నైపుణ్యాన్ని, శక్తిసామర్థ్యాన్ని వినియోగించేందుకుసిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర గ్లోబల్ ప్రతిష్ఠను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నట్లు వివరించారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ లో లీడర్ షిప్ కోర్సు పూర్తి చేశారు. గత నెల 25 నుంచి 30 వరకు 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పేరిట నిర్వహించిన తరగతులకు హాజరైన ఆయన.. తన అధికారిక కార్యక్రమాల చివరి రోజు సందర్భంగా శనివారం యూనివర్సిటీలో వివిధ ప్రతినిధి బృందాలతో భేటీ అయ్యారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో పాటు, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కొలంబియా విశ్వవిద్యాలయం వంటి ప్రముఖ విద్యాసంస్థల విద్యార్థులు, అలుమ్నీలతోనూ సీఎం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఈ సమావేశాల్లో నాయకత్వం, విజయానికి సంబంధించిన అంశాలు, ఆర్థిక వృద్ధి, అభి వృద్ధి నమూనాలు, సుస్థిరత, పర్యావరణ సవాళ్లు, రైతులు, మహిళలు, యువతకు సంక్షేమ విధానాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం రాష్ట్రం ఎదుర్కొంటోన్న సవాళ్లతో పాటు తన దీర్ఘకాలిక విజన్ తెలంగాణరైజింగ్ కోర్ పిల్లర్లను వారికి వివరించారు. సమగ్ర వృద్ధి, భాగ స్వామ్య భాగస్వామ్యం (స్టేక్‌హోల్డర్ పార్టిసిపేషన్), శక్తివంతీకరణ ఆధారిత అభివృద్ధికి ఈ విజన్ కల్పించే అవకాశాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఒక విద్యార్థు ల బృందం తమకు నాయకత్వం గురించి బోధించాలని కోరగా అందుకు హార్వర్డ్ ప్రొఫెసర్లే ఉత్తములు అని ఈ విషయంలో తాను మోసపూరిత ప్రొఫెసర్ పాత్రను ధరించదలుచుకోలేదని సీఎం సరదాగా వ్యాఖ్యానించారు.

## ప్రమాదాలపై దృష్టి

- త్వరలోనే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సర్టిఫికేషన్, ప్రతిజ్ఞ విధానం అమలు
- మంత్రి పొన్నం ప్రభాకర్
- అలియా ప్రభుత్వ పాఠశాలలో ట్రాఫిక్ అవగాహన పార్క్ ప్రారంభం




**జనవరి 31 :** రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతా , ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో రాబోయే రోజుల్లో విద్యార్థులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సర్టిఫికేషన్, ప్రతిజ్ఞ విధానాన్ని ట్రాన్స్‌పోర్ట్ శాఖ అమలు చేయనుందని చెప్పారు. గతనెల ఒకటో తేది నుంచి శనివారం వరకు రోడ్డు భద్రత మాసోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌లోని ప్రభుత్వ అలియా

మిగతా 2లో

# పాలస్తీనాకు మద్దతు కొనసాగిస్తాం



మొదటి పేజీ తరువాయి

చేయడంపై ఈ సమావేశం దృష్టి సారించింది. ఈ ప్రాంతంలో సుస్థిరత, శాంతి ప్రయత్నాల ప్రాధాన్యమిస్తూ, చర్చలు రాజకీయ సమన్వయాలు, ఆర్థిక సహకారం గురించి కూడా సాగాయి. పాలస్తీనా ప్రజలకు భారత్ తోడ్పాటునందిస్తూనే ఉంటుందని నొక్కి చెప్తూ, గాజాలో శాంతిని పునరుద్ధరించేందుకు జరుగుతున్న దౌత్యపరమైన కృషిని ప్రధానమంత్రి మోడీ ఆహ్వానించారు. అక్కడ నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు చర్చలు, శాంతియుత పరిష్కారాల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. దశాబ్దాల దౌత్య సంబంధాలను ప్రతిఫలిస్తూ, భారతదేశం పాలస్తీనాతో గాఢమైన, చారిత్రక ప్రజల మధ్య సంబంధాలను కొనసాగిస్తోందని ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది. ప్రాంతీయ భద్రతకు ఆవల, కీలకమైన వాణిజ్య, పెట్టుబడి, ఇంధన, సాంకేతిక, ఆరోగ్యరక్షణ, ఆవిష్కరణ రంగాలలో అరబ్ దేశాలతో సహకారాన్ని ప్రగాఢం చేసుకోవాలన్న భారత్ ఉద్దేశాన్ని ఈ సమావేశం పట్టి చూపింది.భారత్ అరబ్ ప్రపంచం మధ్య ఆర్థిక భాగస్వామ్యాలను పెంచుకోవడం, సుదీర్ఘకాలిక వ్యూహాత్మక సంబంధాలను పెంచుకునేందుకు మార్గాల గురించి నాయకులు చర్చించారు. కాగా, ప్రధాని వ్యాఖ్యలకు ఆన్‌లైన్‌లో మిశ్రమ స్పందన కనిపించింది. కొందరు భారత్ సమతుల దౌత్యపరమైన వైఖరిని ప్రశంసిస్తుండగా, మరికొందరు గాజా సంఘర్షణను పరిష్కరించేందుకు బలమైన అంతర్జాతీయ జోక్యం అవసరమని అభిప్రాయపడ్డారు.

# నిర్మల ఎవరికి ఏమిస్తారు?

మొదటి పేజీ తరువాయి

**మధ్యతరగతి, పన్ను ప్రశ్న**

మధ్యతరగతి వర్గం ఈ బడ్జెట్ చక్రంలోకి భారీ అంచనాలతో కాకుండా పెరుగుతున్న అలసటతో ప్రవేశిస్తోంది. ప్రత్యక్ష పన్ను వసూళ్లకు వెన్నెముకగా నిలిచే జీతాలు పొందే పన్ను చెల్లింపుదారుల వాస్తవ ఆదాయాలు ద్రవ్యోల్బణం కంటే వేతన వృద్ధి వెనుకబడి క్రమంగా క్షీణిస్తున్నట్లు గమనిస్తున్నారు. ప్రతి ఏదాదీ దాదాపు ఎనిమిది కోట్లకు పైగా ఆదాయపు పన్ను చెల్లింపుదారులలో, సుమారు 85 శాతం వేతనదారులే కావడంతో ఈ భారం క్రమంగా కేంద్రీకృతమవుతోంది. డిమాండ్ ఉచితాల కోసంకాదు, హేతుబద్ధీకరణ అధిక ప్రామాణిక తగ్గింపులు, ద్రవ్యోల్బణంసూచీతో పన్ను స్లాబ్‌లు, పాత, కొత్త పన్ను విధానాల మధ్య ఎక్కువ స్పష్టతను కోరుకుంటున్నారు. ఈ ఒత్తిడిని విస్మరిస్తే పట్టణ వినియోగం మరింత తగ్గే ప్రమాదం ఉంది.



**ఇకపై విస్మరించలేని వినియోగ సంకేతాలు**

జీడీపీలో సుమారు 56 శాతంగా ఉన్న ప్రైవేట్ వినియోగం, స్థిరమైన వృద్ధి గణాంకాలు ఉన్నప్పటికీ మందగమన సంకేతాలను చూపుతోంది. పట్టణ విచక్షణా వ్యయం జాగ్రత్తగానే ఉంది. అయితే గ్రామీణ డిమాండ్ ఆదాయ విస్తరణ కంటే ఎక్కువగా ప్రభుత్వ బదిలీల మీద ఆధారపడి ఉంటోంది. ఆటోమొబైల్స్, హౌసింగ్, వేగంగా క్రయమయ్యే వినియోగ వస్తువుల అమ్మకాల డేటా ప్రవేశ స్థాయి విభాగాలకు మించిప ఒత్తిడిని సూచిస్తోంది. వ్యయ రిస్కులను పరిష్కరించకుండా, మూలధన వ్యయంపై ఎక్కువగా ఆధారపడే బడ్జెట్ వృద్ధి అసమతుల్యతను సృష్టిస్తుంది. అది గణాంకాలలో బలంగా కనిపించినప్పటికీ, సెంటిమెంట్‌లో పెళుసుగా ఉంటుంది.

**పరిశ్రమలకు భరోసా కావాలి, రాయితీలు కాదు**

కార్పొరేట్ ఇండియా మితమైన అంచనాలతో బడ్జెట్‌ను సమీపిస్తోంది. పన్ను ప్రోత్సాహకాల కంటే విధానాల స్థిరత్వం, అమలు సామర్థ్యం, వ్యయ పోటీతత్వానికే నేడు ఎక్కువ ప్రాధాన్యత ఉంది. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహకాల చట్రంతో సమలేఖనం అయిన ఉత్పత్తి రంగాలు ప్రపంచ విలువ ఆధారిత లంకెలతో లోతైన అనుసంధానాన్ని కోరుకుంటున్నారు తప్ప పొడిగింపులను పెంచుకుంఊ పోవడాన్ని కాదు. నేటికీ జీడీపీలో సుమారు 14 శాతంగా ఉన్నాయని అంచనా వేస్తున్న లాజిస్టిక్స్ వ్యయాలు, పోటీతత్వాన్ని మొద్దుబారుస్తున్నాయి. దాదాపు 11 కోట్లమంది వ్యక్తులకు ఉపాధి కల్పిస్తూ, జీడీపీలో 30 శాతానికి దోహదం చేస్తున్న ఎంఎస్ఎంఇలు ఇప్పటికీ రుణ లభ్యత, ఆలస్యంగా చెల్లింపులు, నిబంధనల భారాల వల్ల, ఈ రంగం పరిమితులకు లోబడి ఉంది. ఉపరితల ఉపశమనం కాకుండా, నిర్మాణాత్మక సంస్కరణే ఈ పరిశ్రమల ప్రధాన డిమాండ్.

**విదేశీ పెట్టుబడులు, ఆర్థిక విశ్వసనీయత**

విదేశీ పెట్టుబడిదారులకు, బడ్జెట్ భారతదేశ ఆర్థిక గంభీరతకు సంకేతం. ప్రపంచ సరఫరాలంకెల వైవిధ్య పరచుకోవడంలో భారతకు ప్రాధాన్యతనిచ్చి గమ్యస్థానంగా పరిగణించిప్పటికీ, మూలధనాన్ని మాత్రం ఎంపిక చేసుకొని పెట్టడం పెరుగుతోంది. జీడీపీలో 5.5 6 శాతం మధ్య ఉన్న ఆర్థిక లోటు విశ్వసనీయ స్థిరీకరణ ద్వారా మాత్రమే నిలకడగా ఉంటుంది. రూ.11 లక్షల కోట్లకు పైగా మౌలిక సదుపాయాల వ్యయం వృద్ధికి తోడ్పడినప్పటికీ, మార్కెట్లు ఫైనాన్సింగ్ నాణ్యత, ఆస్తి ద్రవీకరణ ప్రయత్నాలు, బడ్జెట్ వెలుపల రుణాలలో పారదర్శకతను అంచనా వేస్తాయి. స్థిరత్వం, అంచనా వేగలగడం అన్నవి కొత్తదనం కంటే ముఖ్యం.

**ద్రవ్యోల్బణ నియంత్రణే నిశ్శబ్ద పరీక్ష**

ద్రవ్యోల్బణ నియంత్రణ బడ్జెట్‌కు కనిపించని ప్రమాణంగా నిలుస్తుంది. ఆహార ధరలు అంచనావేయలేనివిగా ఉండగా, సేవల ద్రవ్యోల్బణం మొండిగా సాగుతోంది. అధిక ఆర్థిక ఉద్దీపనలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ధరస్థిరత్వ ప్రయత్నాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది, అయితే, అధిక నియంత్రణ డిమాండ్ ను బలహీనపరిచే ప్రమాదం ఉంది. రవాణా, పట్టణ మౌలిక సదుపాయాలు, ఇంధన రంగాలలో మూలధన వ్యయం సురక్షితమైన వృద్ధి మీటగా కొనసాగుతూ, ద్రవ్యోల్బణాన్ని పెంచకుండా ఉపాధిని సృష్టిస్తోంది. రాబోయే నెలల్లో ద్రవ్య విధాన ఆవరణను ఆర్థిక సంకేతాలు తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి.

**లోటు నిర్వహణ, మార్కెట్ క్రమశిక్షణ**

ఆర్థిక స్థిరీకరణ బాండ్ మార్కెట్లు, రేటింగ్ ఏజెన్సీల నుండి ఒకేలాగా పరిశీలనను ఆకర్షిస్తుంది. పతాక శీర్షికలో ఉండే లోటు గణాంకానికి మించి, ఖర్చుల నాణ్యత, ఆదాయ అంచనాల వాస్తవికతపై దృష్టి కేంద్రీకృతమవుతుంది. పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాలు, ఆస్తుల ద్రవీకరణ, రాయితీల హేతుబద్ధీకరణ విశ్వసనీయతను నిర్వచిస్తాయి. తక్షణ జాతీయ ఎన్నికల ఒత్తిడి లేకుండా, ప్రభుత్వం సంయమనం ప్రదర్శించడానికి అవకాశం ఉంది. నిజమైన దిద్దుబాటు కంటే అకౌంటింగ్ చాతుర్యంపై ఆధారపడే బడ్జెట్ స్వల్పకాలిక ఆమోదాన్ని పొందవచ్చు కానీ దీర్ఘకాలిక రుణ వ్యయాలను పెంచుతుంది.

**ట్రంప్ సుంకాలు, బాహ్య షాక్‌ల శోషణం**

డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్ కు తిరిగి రావడం, ఆయన సుంకాల కేంద్రీకృత ఆర్థిక వ్యూహం అన్నమబ్బులు బడ్జెట్ పై కమ్మడం వల్ల ప్రపంచ వాణిజ్య అనిశ్చితి తిరిగి మొదలైంది. భారతదేశపు అతిపెద్ద ఎగుమతి మార్కెట్ గా అమెరికా కొనసాగుతోంది, ఎగుమతులు ఏటా $90 బిలియన్లకు చేరుకుంటున్నాయి. ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్, ఔషధాలపై సుంకాల పెంపు పరోక్ష నష్టాలను కలిగిస్తాయి. భారతఖ ప్రతిస్పందన, ఘర్షణాత్మకంగా కాక, వ్యూహాత్మకంగా ఉండాలి. లాజిస్టిక్స్ సంస్కరణ, ఎగుమతి రుణం ,వేగవంతంగా వాణిజ్య సౌకర్యాలు అందించడం ద్వారా ఎగుమతి పోటీతత్వాన్ని బలోపేతం చేయడం ప్రతీకారం కంటే ఎక్కువ మన్నికైన రక్షణను అందిస్తుంది.

**దేశీయ బలం ద్వారా ప్రమాదాల తటస్థీకరణ**

బహిర్గత షాక్‌లకు వ్యతిరేకంగా ప్రభావవంతమైన రక్షణ కవచం అన్నది దేశీయ డిమాండ్‌ను, పోటీ తత్వాన్నీ బలోపేతం చేయడంలో ఉంటుంది. రక్షణాత్మక వైఖరి కంటే స్థిరమైన అంతర్గత మార్కెట్ ప్రపంచ అస్థిరతను బాగా తట్టుకుంటుంది. ఎంఎస్ఎంఇలకు మద్దతు, సాంకేతిక పరిజ్ఞానం తాజాపరచడం, ఉత్పాదకతను పెంచే పెట్టుబడులు వాణిజ్య ఉద్రిక్తతలను పెంచకుండా ఎగుమతి ఆధారిత రంగాలకు కొంత ఊరటను కల్పించగలవు. ఎగుమతి మార్కెట్లను వైవిధ్యపరచడం, దేశీయ ప్రమాణాలను ప్రపంచ నిబంధనలతో సమలేఖనం చేయడం ఆ ఊపును కొనసాగించడానికి కీలకం.

**నాటకీయత కంటే లోతు అవశ్యకం**

అంతిమంగా, ఈ బడ్జెట్ ఉపశమనం, సంయమనం, వృద్ధి, స్థిరత్వం, దేశీయ ప్రాధాన్యతలు, ప్రపంచ వాస్తవాల మధ్య సమతుల్యత గురించి. ఇది మధ్యతరగతిపై గల ఒత్తిడిని గుర్తించాలి, బడుగు, బలహీనులను రక్షించాలి, పరిశ్రమకు తోడ్పాటునందించాలి, పెట్టుబడిదారులకు భరోసా ఇవ్వాలి. అదే సమయంలో ఆర్థిక విశ్వసనీయతను కాపాడుకోవాలి. సీతారామన్ బడ్జెట్ ఈ సమతుల్యతను నిర్వహిస్తే, అది తక్షణ ప్రశంసలను పొందకపోవచ్చు, కానీ నాటకీయత కంటే ఆర్థిక లోతు చాలా ముఖ్యమైన సమయంలో ఇది విశ్వాసాన్ని బలపరుస్తుంది.

- రవి

# ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర పవార్

మొదటి పేజీ తరువాయి



ఆచార్య దేవవ్రత్, చంద్రశేఖర్ బావాన్‌కులే, ఎన్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ తత్కరే, ఎన్సీపీ ఎంపీ ప్రఫుల్ పటేల్, చగన్ భుజ్‌బల్ సహా పలువురు నాయకులు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. లోక్‌భవన్‌కు బయలుదేరే ముందు సునేత్ర పవార్ దివంగత అజిత్ దాదా పవార్ చిత్రపటానికి పుష్పాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఉదయం, సునేత్రను పార్టీ శాసనసభ నాయకురాలిగా ఎన్నుకున్నారు. అజిత్‌పవార్ మరణానంతరం, ఎన్సీపీ నాయకులలోని ఒక వర్గం భర్త నిర్వహించిన ఉపముఖ్యమంత్రి పదవిని ఆమెకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, సునేత్ర 2010లో పర్యావరణం గురించి చైతన్యాన్ని పెంచడానికి, పర్యావరణ స్పృహ ఉన్న సమాజాలను ప్రోత్సహించి, పోషించడానికీ ఎన్విరాన్‌మెంటల్ ఫోరం ఆఫ్ ఇండియా (ఇఎఫ్ఐ)ను ప్రారంభించారు.

ఆమె అఫిడవిట్ ప్రకారం, ఆర్థిక సంవత్సరం 202223కు ఆమె ప్రకటిత ఆదాయ మొత్తం, రూ. 4,22,1,010. 2024 లోక్‌సభ ఎన్నికల వరకూ సునేత్ర పవార్ పెద్దగా బయట కనిపించలేదు. ఆ ఏడాది లోక్‌సభ ఎన్నికలలో, ఆమె భర్త పార్టీ అభ్యర్థిగా బారామతి నుంచి పోటీ చేసి, తన వదిన, పదవిలో ఉన్న ఎన్సీపీ (ఎస్‌పి) ఎంపీ సుప్రియా సూలే చేతిలో ఓడిపోయారు. అనంతరం సునేత్ర పవార్ రాజ్యసభకు ఎన్నికయ్యారు.

**ఎన్సీపి, ఎన్సీపి (ఎస్‌పి) విలీన చర్చలను ఖండించిన సునీల్ తత్కరే**

అజిత్ దాదా అస్తికలను రాష్ట్రమంతా తీసుకువెడతాం. సమావేశం జరుగుతున్న వీడియో ఒకటి చూశాం. ఆ సమావేశం వ్యవసాయ ప్రదర్శన సందర్భంగా జరిగింది. ఆ సమావేశానంతరం, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి చర్చలు జరిగాయని అజిత్ దాదా మీడియాకు చెప్పారని. తత్కరే అన్నారు.

# మున్సిపోల్స్ సెమీ ఫైనల్స్

మొదటి పేజీ తరువాయి

సామాన్యుల సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆరోపించరు. రూ. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు తమ కళ్లముందే కూలిపోతోందన్నారు. ఇది వారి అవినీతికి నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఎద్దేవా చేశారు. ఇటీవల నిర్వహించిన పంచాయితీ రాజ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు మంచి ఆధిక్యత వచ్చిందన్న ఆయన పురపాలికల్లో కూడా అలాంటి ఫలితాలేపునరావృతం కాబోతున్నాయన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకమై పనిచేసే వారికే కార్యకర్తలకే కాంగ్రెస్ టిక్కెట్లు ఇస్తున్నామని అన్నారు. తమతో కలిసి వచ్చే పార్టీలకు కాంగ్రెస్ ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని అన్నారు. గతంలో ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు ప్రతి ఎన్నికను ప్రభుత్వ పనితీరుకు రిఫరెండం అని



ప్రకటించి భంగపడ్డారన్న ఆయన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు వారిని తిరస్కరించారని గుర్తు చేశారు. ఈసారి కూడా ఆ దొరవారు భంగపడితే ఏం చేస్తారో చెప్పాలని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. తొర్రూరు పట్టణంలో పర్యటించిన పొంగులేటి... ఆ మున్సిపాల్టీని తాను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్న తాను తన నియోజకవర్గంతో సమానంగా ఈ మున్సిపాల్టీని అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్నిసంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ ఎమ్మెల్యే, ఎంపీతో సహా అందరూ కాంగ్రెస్ వారేనన్నారు. తొర్రూరు పురపాలికలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే ప్రగతి పథకాల అమలు మరింత సులువు అవుతుందన్నారు. ప్రభుత్వం పేదల పక్షపాతి అనే విషయం గడచిన రెండేళ్లలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పాటు వివిధ పథకాలు స్పష్టం చేస్తున్నాయని చెబుతూ కాంగ్రెస్ అభ్యర్థి శ్రవణ్‌ను గెలిపించాలని మంత్రి పొంగులేటి కోరారు.

# ప్రమాదాలపై దృష్టి



మొదటి పేజీ తరువాయి

మోడల్ హై స్కూల్‌లో ట్రాఫిక్ అవగాహన పార్క్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రోడ్డు భద్రత సమాజం మొత్తం బాధ్యత అన్నారు.రోడ్డు ప్రమాదాలతో ప్రతిరోజూ సగటున 20 మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ భద్రతను పాఠశాల స్థాయినుంచే ఒక సక్రమ విద్యా అంశంగా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇదే తరహా ట్రాఫిక్ అవగాహన పార్కులను ఇతర పాఠశాలల్లో కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రతి వాహనదారులు హెల్మెట్ ను తప్పక వాడాలని ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు. రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 7వేల మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు వృద్ధ వయస్సు గలవారు అధికంగా ఉన్నారని తెలిపారు. ద్విచక్ర వాహనాలకు రక్షణకు తప్పక హెల్మెట్ వాడడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రోడ్ సేఫ్టీ మాసం సందర్భంగా 64 ప్రభుత్వ, 117 ప్రైవేట్ పాఠశాలలు కలిపి మొత్తం 181 పాఠశాలల్లో 24,648 మంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఏడాది పొడవునా అవగాహన కొనసాగితే ప్రమాద మృతుల్లో గణనీయమైన తగ్గుదల సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ, ట్రాఫిక్ అవగాహన పార్క్ ఒక "లివింగ్ క్లాస్‌రూమ్"లా పనిచేస్తుందని చెప్పారు. పుస్తకాలకే పరిమితం కాకుండా ఆటలు, అనుకరణల ద్వారా రోడ్డు సూచికలు, పాదచారి ప్రవర్తన, సైక్లింగ్ క్రమశిక్షణ, హెల్మెట్ భద్రత వంటి అంశాలను పిల్లలు ప్రాక్టికల్‌గా నేర్చుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. హైదరాబాద్ అధిక ప్రమాద ప్రాంతంగా ఉన్న నేపథ్యంలో, నగరాన్ని ఆదర్శ రోడ్డుసురక్షిత నగరంగా తీర్చిదిద్దేందుకు సమిష్టిబాధ్యత అవసరమని పిలుపునిచ్చారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) జోయెల్ డేవిస్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు కుటుంబాలపై తీవ్ర దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయనీ ముఖ్యంగా కుటుంబ ఆదాయాధారం కోల్పోతే ఆర్థిక ఇబ్బందులు, పిల్లల విద్యలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. తండ్రులు, తల్లులు మరియు తమకూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలంటూ కుటుంబ సభ్యులను ఒప్పించేలా విద్యార్థులు "సేఫ్టీ అంబాసిడర్లు"గా మారాలని కోరారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు చూసి పిల్లలను అభినందించారు. అక్కడున్న వారందరితో రోడ్ సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో యునిసెఫ్ ప్రతినిధులు డా. జెలాలెం, డా. శ్రీధర్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు రమేష్, చంద్రశేఖర్ గౌడ్, జిల్లా రవాణా అధికారి పురుషోత్తం రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, కార్పొరేటర్ సురేఖ, రాష్ట్ర రవాణా అథారిటీ సభ్యుడు నవీన్, హైదరాబాద్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు సురేష్, ట్రాన్స్‌పోర్ట్, విద్య, ట్రాఫిక్ పోలీస్ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు

# ఉత్సాహంగా ప్రారంభమైన 'సీఎం కప్' క్రీడలు



**జగదేవపూర్, జనవరి 31**

సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శనివారం 'సీఎం కప్ 2026' క్రీడా పోటీలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను స్థానిక తహసిల్దార్ నిర్మల, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎంఈఓ సైదులు మరియు సబ్ ఇన్స్పెక్టర్ కృష్ణా రెడ్డి సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని, గ్రామీణ స్థాయి క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోవడానికి సీఎం కప్ ఒక సువర్ణావకాశమని పేర్కొన్నారు. మండల స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన వారు జిల్లా మరియు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు మండల ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

# మునిగిసిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు

- నెల రోజులుగా కొనసాగిన అవగాహన కార్యక్రమాల ముగింపు
- వ్యాసరచన, ప్రశ్నావళి, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రశంసా పత్రాల అందజేత
- విద్యార్థులతో రహదారి భద్రత ప్రతిజ్ఞ
- జిల్లా రవాణా శాఖాధికారి శ్రీ వి. లక్ష్మణ్





**సిద్ధిపేట, జనవరి 31**

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని గత 31 రోజులుగా నిర్వహించిన పలు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా, శనివారం విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రత నియమ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన వ్యాసరచన, ప్రశ్నావళి (క్విజ్) మరియు ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు జిల్లా రవాణా శాఖాధికారులు స్వయంగా వారి పాఠశాలలకు వెళ్లి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖాధికారి శ్రీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా రహదారి భద్రత నిబంధనలు పాటించాలని, తద్వారా ప్రాణాపాయ ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. పోటీల్లో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ, ఇదే స్ఫూర్తితో తమ తల్లిదండ్రులు మరియు తోబుట్టువులు కూడా నిబంధనలు పాటించేలా పిల్లలు బాధ్యత తీసుకోవాలని కోరారు. వాహన తనిఖీ అధికారి శంకర్ నారాయణ మాట్లాడుతూ రహదారి భద్రత మనందరి బాధ్యతని, రేపటి పౌరులైన విద్యార్థులకు వీటిపై అవగాహన ఉండడం ఎంతో మేలు చేస్తుందని భావించి ఈ కార్యక్రమాల్లో వారిని భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. కార్యక్రమ ముగింపులో సహాయక వాహన తనిఖీ అధికారి శ్రీకాంత్ రెడ్డి విద్యార్థుల చేత రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు జగ్గు మల్లారెడ్డి మరియు ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు భగవాన్ రెడ్డి గారు కూడా పాల్గొన్నారు.

# 16వ వార్డులో ఇంటింటి ప్రచారం



**గజ్వేల్, జనవరి 31**

ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి నాయిని సత్యలక్ష్మి యాదగిరి శనివారం విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డు ప్రజలను నేరుగా కలుస్తూ, తమను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. గతంలో ఉప సర్పంచ్‌గా, ఎంపీపీగా పనిచేసిన అనుభవం ఉందని, ఓడినా గెలిచినా నిత్యం ప్రజల మధ్యే ఉంటున్నామని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సన్నబియ్యం వంటి పథకాలు గడప గడపకూ చేరుతున్నాయని వివరించారు. వార్డు సమస్యలను సొంత సమస్యలుగా భావించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాజిద్, నాగరాజు, సమీర్, మహమ్మద్ జలాలుద్దీన్, జుబేర్, అల్వాల మహేందర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వివక్ష లేని సమాజ స్థాపనే లక్ష్యం

## జగదేవపూర్‌లో ఘనంగా 'పౌర హక్కుల దినోత్సవం'



పౌర హక్కుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సమాజంలో సమానత్వం సాధించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని రెవెన్యూ అధికారులు మరియు ఏఎస్సై రమణారెడ్డి పేర్కొన్నారు. సిద్ధిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని శనివారం అనంతసాగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కుమార్ ఆధ్వర్యంలో 'పౌర హక్కుల దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవడంలో పౌరులు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శి మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**సిద్ధిపేట, జనవరి 31 (**

శనివారం సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల రాత్రి భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. పప్పు చారులో పప్పు లేకపోవడం, వంకాయ పచ్చడి సరిపడా వండకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మెను రిజిస్టర్‌లో ఉన్న పరిమాణానికి, వండిన వంటకాలకు పొంతన లేకపోవడాన్ని గుర్తించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు ఎస్ఓ పై చర్యలు తీసుకోవాలని ఫోన్ ద్వారా డిఈఓను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో రాజీ పడొద్దని హెచ్చరించారు.అనంతరం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అటెండెన్స్, ఓపీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. రాత్రి వేళల్లో వచ్చే రోగులకు అందుబాటులో ఉండి, ఓపికగా మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు.



# ప్రజావాణి రద్దు

**కలెక్టర్ విజయేంద్ర బోయ**

**మహబూబ్ నగర్ జనవరి 31**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు 2026 దృష్ట్యా ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



# అభిమానుల కోలాహలం మధ్య బొబ్బల వెంకట్ రామ్ రెడ్డి జన్మదిన వేడుకలు

**– జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆరుట్ల రాజు యాదవ్ మిత్రబృందం**



మన్సురాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి ఎల్బీనగర్ మన్సురాబాద్ లో టి.ఆర్ ఇన్ఫ్రా డెవలపర్స్, టి.ఆర్ ఫౌండేషన్ అధినేత బిజెపి సీనియర్ నాయకులు బొబ్బల వెంకట్ రామిరెడ్డి జన్మదిన వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథులుగా ప్రముఖ రియాల్టర్స్ ఆరుట్ల రాజు యాదవ్, వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్, గాజుల భగత్ యాదవ్, కొత్త విజయ్ కుమార్ గౌడ్, ఢిల్లీ వెంకట్, బచ్చన గోని శ్రీశైలం యాదవ్, తదితరులు పాల్గొని బొబ్బల వెంకట్ రామ్ రెడ్డికి శాలువాతో తో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో కొనసాగుతూ భారతీయ జనతా పార్టీ నాయకుడిగా, ప్రజా సేవకుడిగా గుర్తింపు పొందిన నాయకుడు బొబ్బల వెంకట్ రామిరెడ్డి మరెన్నో ఉన్నత పదవులు చేపట్టి, ప్రజా ప్రతినిధిగా ప్రజలకు సేవ చేసే అవకాశం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అభిమానులు మిత్రులు తదితరులు పాల్గొన్నారు

# అమనగల్ పట్టణంలో శివ స్వాములకు అన్నప్రసాదం చేసిన

**– ప్రముఖ సంఘ సేవకులు టిఆర్ఎస్ పార్టీ ఐదవ వార్డు అభ్యర్థి పాపిశెట్టి రాము**



ఆమనగల్ వార్త మిర్రర్ జనవరి 31 రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం లోని ఆమనగల్ మున్సిపాలిటీలో ప్రముఖ సంఘ సేవకులు 5వ వార్డు అభ్యర్థి పాపిశెట్టి రాము తమ ఆప్టికల్ షాప్ మొదటి సంవత్సరం పూర్తయిన సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఆమనగల్ మున్సిపాలిటీలోని శివ స్వాములకు మరియు భక్తులకు దాదాపు 300 మందికి అన్నప్రసాద కార్యక్రమాన్నినిర్వహించినారు,ఈ కార్యక్రమం రామన్న సేన ఆధ్వర్యంలో కార్యకర్తలు పాల్గొని వచ్చిన భక్తులకు మరియు రామన్న అభిమానులకు అన్నప్రసాధన కార్యక్రమం నిర్వహించినారు,ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ కార్యకర్తలు మరియు రామన్న సేన కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పాపిశెట్టి రాము తెలిపారు,

# ప్రభుత్వ అదనపు కార్యదర్శి జి.శివ కృష్ణ పదవీ విరమణ

**– ఘనంగా సన్మానించిన మల్లికంటి వీరన్న**




సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 31: తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి పేషీలో ప్రభుత్వ అదనపు కార్యదర్శి (ఆర్థిక శాఖ)గా గత 40 సంవత్సరాలుగా సేవలందించిన అధికారి జి.శివ కృష్ణ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మల్లి కంటి వీరన్న మర్యాదపూర్వకంగా ఆయనను కలసి, సుదీర్ఘ సేవలందించినందుకు అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సేవల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను వారు ప్రశంసించారు.

# ముగిసిన నామినేషన్ల పరిశీలన -- 126 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమం ఎన్నికల అధికారి జి వెంకట్రాంరెడ్డి



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 31 చౌటుప్పల్ పురపాలక సంఘం 2వ సాధారణ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శనివారం అత్యంత ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జరిగిన ఈ ప్రక్రియను రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్డిఓ శేఖర్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు.నామినేషన్లు 20 వార్డుల నుండి వివిధ పార్టీల నుండి మొత్తం 191 సెట్ల నామినేషన్ పత్రాలను 126 మంది అభ్యర్థులు సమర్పించడం జరిగింది.పరిశీలన అనంతరం అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలు, సాంకేతిక అంశాలను నిశితంగా పరిశీలించిన తర్వాత, మొత్తం 126మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఆర్వో లు ఏఆర్ఓ లు అధికారులు ధ్రువీకరించారు. చౌటుప్పల్ ఆర్టీవో, మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో అభ్యర్థుల సమక్షంలోనే ఈ పరిశీలన పారదర్శకంగా జరిగింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు మధ్య ప్రక్రియను పూర్తి చేశారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ, పారదర్శకతకు పెద్దపీట వేసినట్లు చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాం రెడ్డి వెల్లడించారు.

# ఉత్తమ విద్యుత్ అధికారి పురస్కార గ్రహీత ఏఈకి యాదవ సంఘ నేతలు సన్మానం



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 31 విద్యుత్ సేవలలో విశేష ప్రతిభ కనబరిచిన చౌటుప్పల్ విద్యుత్ శాఖ ఏఈ సతీష్ కుమార్ యాదవ్ భువనగిరి జిల్లా కేంద్రంలో 77వ గణతంత్ర వేడుకలలో జిల్లా స్థాయి ఉత్తమ అధికారి పురస్కారం ను జిల్లా కలెక్టర్ హనుమంత రావు,ఎస్పి ఆకాంక్ష యాదవ్ చేతులమీదుగా ప్రశంస పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం చౌటుప్పల మండల, పట్టణ యాదవ సంఘ కమిటీ మ అధ్యక్షుడు చినుకని మల్లేశం యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈ సతీష్ యాదవ్ ను కలిసి అభినందనలు తెలిపారు. ఉత్తమ అధికారి పురస్కారంను రావడంపట్ల హర్షం వ్యక్తపరుస్తూ శాలువతో ఘనంగా సన్మానం చేసి జ్ఞాపిక అందజేశారు.ఈ కార్యక్రమంలో గుండెబోయిన అయోధ్య యాదవ్, చిలకల శ్రీనివాస్ యాదవ్, నల్ల పర్వతాలు యాదవ్,గంగనబోయిన వెంకటేష్ యాదవ్,గజ్జి పాండు యాదవ్,నల్ల గణేష్ యాదవ్, ఆవుల ఏసు యాదవ్,ఆవుల మల్లయ్య యాదవ్,గుండెబోయిన వేణు యాదవ్, గుణమోని లింగస్వామి యాదవ్,గుణమోని బాలకృష్ణ యాదవ్, బద్దుల సుధాకర్ యాదవ్, మెండే మల్లేష్ యాదవ్, ఎం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు: అంబటి రాంబాబుపై చర్యలు తీసుకోవాలి

**– గండికోట విజయ్ కుమార్**

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 31: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఆయనపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్రం తార్నాక డివిజన్ అధ్యక్షులు గండికోట విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమేనని, అయితే బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన వ్యక్తి అసభ్యకరమైన, వ్యక్తిగత దూషణతో కూడిన వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అనే పదవి ఒక పార్టీకి మాత్రమే కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ ప్రతినిధిగా ఉంటుందని, అలాంటి గౌరవనీయమైన హోదాపై హేయమైన వ్యాఖ్యలు చేయడం వ్యవస్థల పట్ల అవమానంగా మారుతుందని విమర్శించారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టడంతో పాటు శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు. రాజకీయ నాయకులు మాట్లాడే ప్రతి మాటకు సామాజిక బాధ్యత ఉంటుందని, అధికారంలో ఉన్నా లేకపోయినా భాషలో హుందాతనం పాటించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అంబటి రాంబాబు తన వ్యాఖ్యలకు వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు సుమోటోగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యంలో విమర్శకు తావున్నా, విచ్చలవిడితనానికి లేదని గండికోట విజయ్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర్ అధికారప్రతినిధి కాసుల సుదర్శన్ రెడ్డి, కాత విజయ్ కుమార్ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



### కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ చేతుల మీదుగా

# జ్ఞాపికను అందుకుంటున్న గంధం శివశంకర్



ఎల్బీనగర్ 31 జనవరిఅంబేద్కర్ భవన్ లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ చేతుల మీదుగా 2026 ఉత్తమ డైరీ ఆవిష్కరణ లో జిల్లా అధ్యక్షులు గంగం శివ శంకర్ జ్ఞాపికను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డి. సుదర్శన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సఫాయి మిత్రుల కోసం ఉచిత వైద్య శిబిరం



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 31 : నగరాల పరిశుభ్రతకు వెన్నెముకలుగా నిలుస్తున్న సఫాయి మిత్రుల ఆరోగ్యం, సంక్షేమాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో సఫాయి మిత్ర సార్థక్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య మరియు ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిలికాన్ ల్యాబ్స్ సీఎస్ఆర్ నిధులతో, అనుభూతి వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య బృందం సహకారం అందించాయి. ముందువరుసలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ఈ శిబిరం ఉపయోగపడింది.శిబిరంలో సఫాయి మిత్రులకు సాధారణ వైద్య పరీక్షలు, ఆరోగ్య సమస్యలపై వైద్య సంప్రదింపులు, కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 100 మందికి పైగా సఫాయి మిత్రులు వైద్య సేవలను పొందారు. ఈ శిబిరాన్ని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ టి. కృష్ణ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా ప్రారంభించారు. డా. కె.ఎస్. రవి (వైద్య అధికారి), ముకేశ్ చోప్రా, ఎన్. వెంకటేష్ (సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ డైరెక్టర్లు)తో పాటు సిలికాన్ ల్యాబ్స్ ఉద్యోగులు, అనుభూతి వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.సఫాయి మిత్రుల పని పరిస్థితులను మెరుగుపరచడం, వారికి తగిన గుర్తింపు కల్పించడం, సామాజిక--ఆర్థిక అభ్యున్నతికి తోడ్పడటమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# ఓయూలో హాస్టల్ వసతులపై వయో పరిమితి నిబంధనను వెంటనే తొలగించాలి

**– బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్**




సికింద్రాబాద్,వార్త మిర్రర్ జనవరి 31: ఉస్మానియా యూనివర్సిటీలో హాస్టల్ వసతుల కోసం అమలు చేస్తున్న వయో పరిమితి నిబంధనను వెంటనే రద్దు చేయాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో యూనివర్సిటీ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ మాట్లాడుతూ సిపిజిసిఈటి 2025--26లో ప్రవేశ పరీక్ష నిర్వహించిన సీట్ల సంఖ్య, అడ్మిషన్లు పొందిన విద్యార్థుల వివరాలు, హాస్టల్ వసతి కల్పించిన విద్యార్థుల సంఖ్యను యూనివర్సిటీ అధికారులు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రవేశ పరీక్షలో ఎలాంటి వయో పరిమితి లేకపోయినా, అడ్మిషన్ అనంతరం హాస్టల్ వసతుల విషయంలో వయో పరిమితి నిబంధనను కొత్తగా అమలు చేయడం అన్యాయమన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు కష్టపడి యూనివర్సిటీలో సీట్లు పొందితే, పరిపాలన నిర్ణయాల వల్ల హాస్టల్ వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఆర్ట్స్ కళాశాలలో పొలిటికల్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులు హాస్టల్ వసతి లేక అడ్మిషన్లు రద్దు చేసుకుని వెళ్లడం విద్యా ప్రమాణాలను తగ్గించే కుట్రగా వారు అభివర్ణించారు. యూనివర్సిటీ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని, మెస్ బిల్లులు చెల్లించినా తగిన సౌకర్యాలు అందడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు బలవంతంగా 75 శాతం హాజరు నిబంధన విధించడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలని, హాజరు నిబంధనను సడలించాలని, విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిపడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఓబీసిఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల మధుతో పాటు ఆవుల శ్రీధర్, శివ యాదవ్, చిందం మధు, మహేష్, షారుక్, నవీన్, ప్రవీణ్, శివ, శశికుమార్, గోపాల్, రవి, నరేష్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# వంజరి సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు సాల్వేరు ముత్తయ్య మృతి



సికింద్రాబాద్, వార్త మిర్రర్: తెలంగాణ వంజరి సంఘం మాజీ అధ్యక్షులు, ముఖ్య సలహాదారులు సాల్వేరు ముత్తయ్య శనివారం గుండెపోటుతో లాలాపేట్ లో మృతి చెందారు. ఆయన మృతితో వంజరి సంఘంలో, లాలపేట్ లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామని సంఘ నాయకులు తెలిపారు. మృతుడి అంత్యక్రియలు శనివారం సాయంత్రం 4 గంటలకు లాలాపేట్ స్మశాన వాటికలో నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు రాష్ట్ర వంజరి సంఘం నాయకులు, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి, బానుక మల్లికార్జున్తో పాటు లాలాపేట్ ప్రాంతవాసులు పెద్ద సంఖ్యలో హాజరై, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఆర్టీసీ ఏడిసి కి పదవీ విరమణ సన్మానం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 31 జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన అనుపురం నాగేశ్వర్ గౌడ్ మెట్పల్లి ఆర్టీసీ డిపోలో ఏడిసిగా విధులు నిర్వహించి శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిపో ఎస్. టి. ఐ. ప్రమీల, ఎం ఎఫ్ చంద్రయ్య, సీనియర్ అసిస్టెంట్ శంకర్ రెడ్డి, సెక్యూరిటీ బ్రాహ్మణిలు పాల్గొని వారు మాట్లాడుతూ అనుపురం నాగేశ్వర గౌడ్ 38 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు ఆర్టీసీలో వివిధ హోదాల్లో అద్భుతంగా పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం తమ జీవితాన్ని కుటుంబ సభ్యుల మధ్య ఉల్లాసంగా ఉత్సాహంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం నాగేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ... పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి తప్పనిసరని,తన పదవీ కాలంలో చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయని అన్నారు.ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని కోరారు. ప్రజల కోసం అహర్నిశలు పట్టుదలతో ఉద్యోగం చేసి గౌరవప్రదంగా పదవీ విరమణ పొందడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. తదుపరి ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది నాగేశ్వర్ గౌడ్ కు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. వారి శేష జీవితం సుఖమయంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్మెంట్ ఉద్యోగులు, డ్రైవర్లు కండక్టర్లు, ఎడిసిలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు....



మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ పోలీస్ స్టేషన్‌ను శనివారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ నుంచి వచ్చిన ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులు శగున్ కుమార్, పి. అశ్విన్, విశ్వ వర్ధన్, మహిళా అధికారి మరియమ్ లిఫ్షా సందర్శించి స్టేషన్ ఫీల్డ్–లెవల్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ రితిరాజ్ ఐపీఎస్ అధికారులతో పరస్పర చర్చ జరిపి, నేరాల నివారణ మరియు గుర్తింపు, దర్యాప్తు విధానాలు, లా అండ్ ఆర్డర్ నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పోలీస్ స్టేషన్ పరిపాలన, ఫీల్డ్ ఆపరేషన్స్ వంటి అంశాలపై విస్తృతంగా వివరించారు.

# కట్టకొమ్ము తండాలో మహిళా సమాఖ్య భవన నిర్మాణ శంకుస్థాపన

- మహిళల సాధికారతకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్:

దేవరకొండ జనవరి 31 వార్త మిర్రర్: దేవరకొండ మండలంలోని కట్టకొమ్ము తండాలో ఎమ్ జిఎన్ఆర్ఈజిఎస్ నిధులు 10 లక్షల రూపాయల వ్యయంతో నూతన నిర్మించనున్న గ్రామ మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులకు అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సాధికారతకు, వారి స్వయం ఉపాధి సమూహ బలోపేతానికి ఈ భవనం ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఇందిరమ్మ స్ఫూర్తితో ముందుకు సాగుతున్న మా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు మరింత బలాన్నిచ్చేలా ఇలాంటి ప్రజా ప్రయోజన కార్యక్రమాలను నిరంతరం అమలు చేస్తోంది. గ్రామీణాభివృద్ధిలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేసే దిశగా ఇది ఒక కీలక అడుగు అని తెలిపారు.తొలి ఏడాదిలోనే లక్ష్యాన్ని మించి రూ. 26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశాం అని అన్నారు.రుణాలతో పాటు శిక్షణ అందించి, మహిళలను చిన్న--మధ్య తరహా పరిశ్రమల వైపు నడిపిస్తూ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నాం. క్యాంటీన్లు, ఆర్టీసీ బస్సుల లీజులు, పెట్రోల్ బంకుల యాజమాన్యం మహిళా సంఘాలకే అప్పగించాం అని ఇందిరా మహిళా డెయిరీలో మహిళలే వాటాదారులు. పాలు నుంచి అనుబంధ ఉత్పత్తుల వరకు అన్ని కార్యకలాపాలు మహిళల చేతులలోనే అని మహిళల ఆత్మగౌరవం, ఆర్థిక బలం, సమాన అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు లోకసాని శ్రీధర్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ అరుణ సురేష్ గౌడ్, సర్పంచుల సంఘం ఫోరం మండల అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్, సర్పంచ్ నేనావత్ జ్యోతి పాండు నాయక్,నేనావత్ కవిత లచ్చిరామ్ నాయక్, డిప్యూటీ లక్ష్మి గోవింద్, రవీందర్ నాయక్,నాయకులు శివయ్య, ఈఈ రఘుపతి, ఏ ఈ శంకర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ హుస్సేన్, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఏపీవో విజయ లక్ష్మి గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు శంకుస్థాపన చేసిన సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 31 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ లో మాజీ మంత్రి జీవన్ రెడ్డి కృషి వల్ల మంజూరు కాబడిన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు అయినా సీమ సుల్తానా భర్త ముజాజ్ ఇల్లు గ్రామ సర్పంచ్, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ ఎంబారి గౌతమి వెంకటేష్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ వినయ్ కుమార్, గ్రామపంచాయతీ పాలక వర్గ సభ్యులు జాగిరి ప్రశాంత్, మందుల రాధ, ఉరుమడ్ల దీపిక, సంజీవ్, అత్తినేని వనిత, బర్ల చంద్రశేఖర్, ఇందిరమ్మ కమిటి సభ్యులు, మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, మాజీ పాక్స్ చైర్మన్ పునుగోటి వెంకటేశ్వర రావ్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎంబారి రమేష్, ఇస్మాయిల్, మండ రవి, పోతు శ్రీను, ఏజాస్ తదితర సభ్యులు పాల్గొన్నారు.




## హజ్రత్ గాలిబ్ షహీద్ ఉర్సు ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన


**– సంస్థాన్ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామి**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి సంస్థాన్ నారాయణపురం మండల రాచకొండ గ్రామంలో హజ్రత్ గాలిబ్ షహీద్ ఉరు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం మండల కేంద్రంలో ఉర్సు ఉత్సవాల సందర్భంగా హజ్రత్ గాలిబ్ షహీద్ ఉర్సు ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామి ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ, వార్డ్ మెంబర్ పందుల యాదగిరి గౌడ్, రాపర్తి బుచ్చయ్య గౌడ్, ఉస్మాన్, సులేమాన్, మహమ్మద్ గౌస్, మాధగోని జంగయ్య గౌడ్, రహీం షరీఫ్, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, గునిగంటి రాజు గౌడ్, మహమ్మద్ హర్షద్,సజ్జు, తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేటలో వింగ్స్ ఇండియా ప్రదర్శన-- సందర్శకుల సందడి





హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి భారత వాయుసేన కు చెందిన సూర్యకిరణ్ ఏ రో బాటిల్ బృందం ఆధ్వర్యంలో బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా 2026 విమానాయా ప్రదర్శన శనివారం కూడా కొనసాగింది ఈ నేపథ్యంలో బేగంపేట విమానాశ్రయంలో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2026 ప్రదర్శనను తిలకించేందుకు అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు ఆకాశంలో విమానాలతో చేసే విన్యాసాలను వీక్షిస్తూ సందడి చేశారు. వీడియో గ్రాఫర్ సందుపట్ల లక్ష్మణ్ సాగర్ మాట్లాడుతూ వింగ్స్ ఇండియా 2026 ఆసియాలోనే అతిపెద్ద సివిల్ ఏవియేషన్ ప్రదర్శనగా అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకుందన్నారు. సూర్య కిరణ్ ఏరో బాటిక్ సాహసోపేత విన్యాసాలు, అత్యాధునిక ఎయిర్ క్రాఫ్ట్ లు మరియు డ్రోన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి అన్నారు

## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 169వ వారం అన్నదానం...



చందానగర్ వార్త మిర్రర్ : హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 169వ అన్నదాన కార్యక్రమం శనివారం గంగారంలోని హోప్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో హోప్ సభ్యులతో పాటు చైర్మన్ కొండ విజయ్కుమార్, కొండా ప్రియాంక పాల్గొని ప్రజలకు అన్న ప్రసాదాలు వడ్డించారు. ఈ వారం అన్నదాన కార్యక్రమానికి సుమారు 2000 మంది పై గా పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. హోప్ చైర్మన్ విజయ్కుమార్ అభిమానూలు అన్నదాన కార్యక్రమంలొ పాల్గొన్నారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం చేపడుతున్న అన్నదానం కార్యక్రమం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. నిత్యం పనులు చేసుకుంటూ జీవనం గడిపే తమకు ప్రతి వారం ఉచిత భోజనం అందజేయడం పట్ల హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ కు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హోప్ సభ్యులు అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌పై ఫిర్యాదు

**– ఫీజుల పెంపుపై ప్రభుత్వ విచారణ కోరిన తల్లిదండ్రులు**

**– ఫీజులు నియంత్రించాలని ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు వినతి**



రామంతపూర్ వార్త మిర్రర్ ప్రతినిధి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట మరియు రామాంతపూర్ బ్రాంచీలకు చెందిన తల్లిదండ్రులు ఈరోజు రాష్ట్ర ఐటీ మంత్రి మరియు ఫీ రెగ్యులేటర్ కమిటీ సభ్యుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారిని కలిశారు. అన్ని బ్రాంచీల్లో పి టి ఏ పర్మనెంట్ టీచర్స్ అసోసియేషన్ లేకుండా స్కూల్ కి సంబంధం లేని వ్యక్తుల పేర్లు( పి టి ఏ) లో పెట్టుకుని ప్రభుత్వాలను సిబిఎస్సి బోర్డు నీ, తల్లి తండ్రులను మోసం చేస్తుంది అని, స్కూల్ యాజమాన్యం ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతోందని వారు తెలిపారు. ఫీజుల పెంపుకు సంబంధించిన లెక్కలు, ఖర్చుల వివరాలు ఇవ్వకుండా ప్రతి సంవత్సరం భారీగా పెంచుతున్నారని, అలాగే విద్యా ప్రమాణాలు ఫీజులకు తగిన స్థాయిలో లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. లెక్కలు లేకుండా పెంచిన ఫీజులపై సమగ్ర విచారణ జరపాలని, ప్రభుత్వ ఫీ రెగ్యులేషన్ నిబంధనలు తెచ్చి కఠినంగా అమలు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

## మైనార్టీ నాయకుడు ఎండి రహీం షరీఫ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

**– సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, వై ఎస్ ఆర్ పార్టీ నాయకులు మాధగోని జంగయ్యగౌడ్**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గంమైనార్టీ నాయకుడు యండి రహీంషరీఫ్ జన్మ దినం సందర్భంగా సంస్థాన్ నారాయణపురం బస్టాండ్ చౌరస్తాలో యండి రహీం షరీఫ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ము ఖ్య అతిథిగా సంస్థాన్ నారాయణపురం గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగ స్వామి, ఇబ్రహీంపట్నం నియోజకవ ర్గం వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ హాజరై కేక్ కట్ చేయించి, శాలువాతో ఘనంగా సన్మానించి రహీంషరీఫ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలోమంచాల మండలం కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గరాములు ముదిరా జ్, సంస్థాన్ నారాయణ పురం గ్రామ మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బైకని నరేందర్ యాదవ్, ఎస్టీ సెల్ మండలంనాయకుడు ఆంబోతురాము నాయక్, మహమ్మద్ వాజిద్, మహమ్మద్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా అభయాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం...



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గుల్మోహన్ పార్క్ నేతాజీ నగర్ లో శ్రీశ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం రెండవ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. శనివారం ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో ఆలయ రెండవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కాలనీ లో తెల్లవారుజామున బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీ భగవతి రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ శివ నాగేంద్ర స్వామి దేవాలయంలో అర్చనలు నిర్వహించిన అనంతరం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం విగ్నేశ్వర పూజలతో ప్రారంభమై హనుమాన్ విగ్రహానికి అభిషేకం నిర్వహించిన వేద బ్రాహ్మణులు హోమం నిర్వహించారు. కాలనీవాసులు పరిసర ప్రాంతాల్లో ఉన్న భక్తులు వేలాదిమంది హాజరై ప్రత్యేక పూజలు తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్, ఉరిటి వెంకటరావు, రాగం మల్లికార్జున్ యాదవ్, శ్రీనివాస్ రాజ్ ముదిరాజ్, సురేందర్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆశనోళ్ళ వెంకటేష్ గౌడ్, కోశాధికారి రామేశ్వరం రెడ్డి, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు ఏ. మల్లేష్ ముదిరాజ్, ఎం. సంతోష్ కురుమ, ఆర్ రమేష్ బాబు, సంయుక్త కార్యదర్శిలు ఎం మహేష్ కురుమ, బుచ్చన్న, ఉప్పరి దయాసాగర్, కార్యనిర్వాహక కార్యదర్శిలు లావా చారి, యాదగిరి సాగర్, ఎం శ్రీను కురుమ, సాంబరాజు, కార్యవర్గ సభ్యులు పి. నర్సిరెడ్డి, సోమేశ్ రెడ్డి, డి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి లక్ష్మీనర్సింహా స్వామి దేవస్థానంలో ఉద్యోగులు అధికారుల అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి

**– రాష్ట్ర ముఖ్యమంత్రి కి సిపిఎం పార్టీ బహిరంగ లేక**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి యాదాద్రి దేవస్థానంలో కొందరు ఉద్యోగులు అధికారులు నగదుగా వచ్చిన విరాళాలు బంగారం వెండి నిత్యవసర సరుకులు దొంగతనం చేస్తున్నట్లుగా అనేక వార్తలు వెలుగులోకి వచ్చినవి విచారణలో కొన్ని వాస్తవాలను కూడా తేలినవి. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో వరుసగా అవినీతికర విషయాలు రావడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ మధ్యకాలంలో భక్తులు సమర్పించిన బంగారు వెండి నుండి నర్సింహా స్వామి ప్రతిమతో తయారు చేసిన లాకెట్ (డాలర్) విక్రయాల్లో అవకతవకల వల్ల సుమారు 10 లక్షల అవినీతి జరిగిందని ఆడిట్ విచారణలో బట్టబయలైంది. ఏ ఈ ఓ పర్యవేక్షణలో జరగాల్సిన డాలర్ల విక్రయంలో ఇతరుల ప్రమేయంపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నవి గతంలో కూడా చింతపండు నెయ్యి దొంగతనం జరిగిందని ఫిర్యాదులందగా కొందరినీ పోలీసులు అరెస్టు చేశారు ఇందులో అసలు దొంగలు బయటపడలేదని చర్చ కూడా ఉన్నది. ప్రతిరోజు వేలాది మంది ఇది దేవస్థానాన్ని సందర్శిస్తుంటారు. భక్తులు తమ మొక్కు తీర్చుకోవడం కోసం కానుకలు సమర్పిస్తుంటారు. భక్తుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ గత కొంతకాలంగా అధికారులు ఉద్యోగులు , కుమ్మక్కై యదేచ్ఛగా అవినీతికి పాల్పడుతుంటే కేవలం పైపై చర్యలు తీసుకుంటూ నామమాత్రంగా కొందరిని సస్పెన్షన్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు ఇది సరైనది కాదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి భక్తులు ప్రజల నమ్మకాన్ని నిలుపాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నదని భావిస్తున్నాము. ఉన్నత అధికారులతోసంపూర్ణ విచారణకు ఆదేశించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ లేఖ విడుదల కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్, స్థానిక సిపిఎం నాయకులు ఈశ్వర్ రెడ్డి, షరీఫ్ ,సీస శ్రీను, మల్లయ్య, జానీ, శ్రీశైలం, నగేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు

## నేడే శ్రీ గుట్ట వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవం




వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 31 జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామా శివారులోని అడవిలో గల గుట్టలో స్వయంభువుగా వెలసిన శ్రీ గుట్ట వెంకటేశ్వర స్వామి జాతర మహోత్సవాన్ని ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం రోజున గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరుచున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, గ్రామ సేవా సమితి అధ్యక్షులు అనుపురం చిన్న లింబాద్రి గౌడ్, వార్డు సభ్యులు ఒరగంటి శేఖర్. కుంచపు గణేష్, గ్రామ నాయకులు కాటిపెల్లి గంగారెడ్డి, కొమ్ముల ఆదిరెడ్డి, మిట్టపల్లి రాంరెడ్డి, మద్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్, నాగిరెడ్డి నర్సారెడ్డి, సుంకిశాల సత్యం గౌడ్, కోక్కూ. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రావుస్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు....



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లిలోని రావుస్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు వార్షికోత్సవ వేడుకలు శ్వేతా గార్డెన్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుల్మోహన్ పార్క్, ఓల్డ్ ఎంఐజి రెండు బ్రాంచీల విద్యార్థి విద్యార్థినీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రావుస్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ ప్రభాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు తమ ఆటపాటలతో ఎంతగానో అలరించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులను రావుస్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ ప్రభాకర్ రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.. విద్యతో పాటు, నైతిక విలువలు, వినయ విధేయతలు కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మారుతున్న విద్యా విధానాలు విద్యార్థుల మనస్తత్వాలను జాగృతి పరిచే దిశగా భోదనాలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు భారంగా కాకుండా ఇష్టంతో చదివితే ఉన్నత స్థానం చేరుకోవచ్చుని,ఈ క్రమంలో చదువు, ఆటలు, సాంస్కృతిక కళలో విద్యార్థులు సాధించిన విజయాలపై వార్షిక నివేదికను ప్రవేశపెట్టిన పాఠశాల యాజమాన్యం,ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## కోతుల బెడద నుండి కాపాడుకొనుటకు నివారణోపాయం బోను



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 31 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని ట్రాక్టర్ యూనియన్ (తమ గ్రామానికి )ఇటిక్యాల గ్రామం పంచాయతీకి శనివారం రోజున ఇనుపబోనులను అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ మా గ్రామంలో కోతుల బెడద నుండి తప్పించుకోవడానికి, నివారణోపాయము ఇనుప బోనులను తయారు చేయించి గ్రామపంచాయతీకి అందివ్వడం జరిగిందని, ఆ బోనులను గ్రామచివరలో గాని లేదా కోతులు ఏ వీధిలో ఎక్కువ సంచరిస్తున్నాయో గుర్తించి ఆ ప్రాంతంలో బోనులో ఉంచి వాటిలో ఏదైనా కోతులు తినుటకు పండ్లు మిగతా ఆహార పదార్థాలు పెట్టినట్లయితే తినడానికి వచ్చి ఆ బోనులో పడిపోతాయని వాటిని తీసుకెళ్లి అటవి ప్రాంతంలో వదిలిపెట్టుటకు సులువైన మార్గమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉపసర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షులు జగడం శ్రీకాంత్, ఉపాధ్యక్షులు నల్లగంగారెడ్డి, కోశాధికారి, ఏల్లాల రాజశేఖర్, నరసింహారెడ్డి,గణేష్,మహేష్, లచ్చన్న,అంజి గ్రామ నాయకులు కాటేపల్లి గంగారెడ్డి, ట్రాక్టర్ యూనియన్ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి బ్యాంకు శాఖ వారిచే ప్రమాద భీమా చెక్ అందజేత



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జనవరి 31 జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం లోని గాయత్రి బ్యాంకు శాఖ యందు జరిగిన ఒక కార్యక్రమంలో గాయత్రి బ్యాంకు యొక్క ఖాతాదారులైన దుంపాల రాజిరెడ్డి ప్రమాదవశాత్తు మరణించగా, మృతుడికి ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు యందు గల గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాదభీమా సౌకర్యం ద్వారా నామిని దుంపాల లలిత కు 1లక్ష రూపాయల చెక్కును రాయికల్ తహసీల్దార్ శ్రీ ఎస్. నాగార్జున చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రాయికల్ తహసీల్దార్ శ్రీ ఎస్.నాగార్జున మాట్లాడుతూ మద్యతరగతి వ్యాపార, ఉద్యోగ వర్గ, ప్రజలకు గాయత్రి బ్యాంకు వారు ఋణాలను ఇస్తున్నారని, నామమాత్రపు చార్జీలతో లక్ష రూపాయల ప్రమాద భీమా ద్వారా ఖాతాదారుల కుటుంబాలకు తమ వంతు బాధ్యతని నిర్వర్తించగలుగుతున్నారని అన్నారు. వినియోగదారులకు 24 గంటలు ఎటిఎం లలో నగదు అందుబాటులో ఉంచడం ద్వారా రాయికల్, పరిసర ప్రాంత ప్రజల నగదు అవసరాలను తీరుస్తున్నారని అన్నారు. అనంతరం బ్రాంచి మేనేజర్ శ్రీ ఎస్.మధు మాట్లాడుతూ మైక్రో ఎటిఎం, ఏఈపిఎస్ సేవల ద్వారా వినియోగదారులకు చెల్లింపులు చేయడం జరుగుతుంది. వినియోగదారులకు ఈ-కేవైసి ద్వారా ఖాతాలను ఓపెన్ చేయడం జరుగుతుంది. కేవలం 0.90% సాలుసరి వడ్డీకే బంగారు ఆభరణాలపై గ్రాముకు అత్యధికంగా రూ? 8,600/- తో ఋణాలను అందిస్తున్నామని, అలాగే రైతులకు వ్యవసాయ రుణాలను కూడా అందిస్తున్నామని తెలియజేశారు. బ్యాంకు యొక్క (కస్టమర్ సర్వీస్ పాయింట్) బ్యాంకింగ్ కరస్పాండెంట్స్ని నియమించి వినియోగదారుల చెంతకు బ్యాంకు సేవలను తీసుకువచ్చారని తెలియజేశారు. సేవింగ్ ఖాతాలు ప్రారంభించుటకు కావలసిన ఫోటో, జిరాక్స్ ల ను బ్యాంకు యందే ఉచితంగా అందిస్తున్నామని, వ్యాపారస్తులకు వ్యాపార వృద్ధికై ఋణాలను అందిస్తున్నామని, అలాగే కిసాన్ వికాస్ పత్రాలు, పోస్టుఆఫిస్ డిపాజిట్లపై కూడ కేవలం 0.83 పైసలకే అనగా 10% (పిఏ) రేటుకి ఋణసౌకర్యం అందిస్తున్నామని వినియోగదారులు ఇట్టి సౌకర్యాన్ని వినియోగించుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ శ్రీ ఎస్.మధు, సీనియర్ ఆఫీసర్ జి. రాము, జూనియర్ ఆఫీసర్ ఎమ్.ఏ. ఆసీఫుద్దీన్ లు పాల్గోన్నారు.